క్లుప్తంగా

పారిశుద్ధ్యంపై పట్టింపేది?

● పంచాయతీ రాజ్ అధికారులపై ఫిర్యాదు

రఘునాథపల్లి: చికెన్ సెంటర్ల కారణంగా పారిశుద్ధ్యం అధ్వానంగా మారుతోంది.. కోళ్ల వ్యర్థాల కారణంగా దుర్వాసనతో వైరస్ ఉత్పత్తి అవుతూ జనం రోగాలబారిన పడుతున్నారని.. నివారణ చర్యలు తీసుకోని పంచాయతీ రాజ్‌శాఖాధికారులపై రఘునాథపల్లి గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త ఠాకూర్ గణేష్‌సింగ్ సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. జనావాసాల్లో కోళ్ల వ్యర్థాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారని, చైనాలో కొత్త వైరస్ వ్యాప్తి చెందుతుందని సీఎం రేవంత్‌రెడ్డి అప్రమత్తం చేసినా పంచాయతీరాజ్‌శాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. చికెన్ సెంటర్ల వద్ద నిత్యం బ్లీచింగ్, పరిశుభ్రత, వీధుల్లో మురుగు నిల్వ ఉండకుండా పంచాయతీ రాజ్ శాఖ అధికారులకు తగు ఆదేశాలు జారీ చేయాలని కలెక్టర్‌కు వినతి పత్రం ఇవ్వగా సానుకూలంగా స్పందించారని ఠాకూర్ గణేష్‌సింగ్ తెలిపారు.

కోర్టు ధిక్కరణ కేసులో ఎస్సైకి ఊరట

రఘునాథపల్లి: కోర్టు ధిక్కరణ కేసులో రఘునాథపల్లి ఎస్సై దూదిమెట్ల నరేశ్‌కు ఊరట లభించింది. గత నెల 27వ తేదీన వారం రోజుల జైలు శిక్ష, జరిమానా విధిస్తు హైకోర్టు సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పు అమలును సోమవారం హైకోర్టు డివిజనల్ బెంచ్ నిలిపివేసింది. తరిగొప్పుల ఎస్సైగా పని చేస్తోన్న సమయంలో ధాన్యం అమ్మకాలకు సంబంధించిన వ్యవహారంలో గొలుసు నర్సయ్యపై 2023 ఫిబ్రవరి 11వ తేదీన స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. నిందితుడిగా చేర్చడంపై నర్సయ్య హైకోర్టును ఆశ్రయించాడు. నోటీసు లిచ్చి.. చట్ట ప్రకారం దర్యాప్తు చేపట్టాలని 2023 ఫిబ్రవరి 11వ తేదీన న్యాయమూర్తి ఆదేశించారు. ఆ తర్వాత ఆరు రోజులకు నర్సయ్యను ఎస్సై అరెస్ట్ చేశాడు. దీనిని హైకోర్టు తప్పుపట్టింది. న్యాయస్థానం ఆదేశాల ధిక్కరణ కిందకు వస్తుందని..41 ఏ నోటీసులు ఇవ్వకుండా ఎలా అరెస్ట్ చేస్తారని ప్రశ్నించింది. ఈ విషయంపై ఎస్సై నరేశ్‌కు వారం రోజులు జైలు, రూ.2 వేల జరిమానా విధించడంతో పాటు, బాధితుడికి రూ.50 వేలు చెల్లించాలని తీర్పునిచ్చింది. దీంతో ప్రభుత్వ న్యాయవాది సింగిల్‌బెంచ్ ఇచ్చిన తీర్పును అప్పీలు చేయగా హైకోర్టు డివిజనల్ బెంచ్ తీర్పు అమలును నిలిపివేసింది.

‘చర్య తీసుకోవాలి’

చిల్పూరు: కొండాపూర్ గ్రామంలోని పీఏసీఎస్ సొసైటీ భవన ప్రహరీ నిర్మాణానికి పిల్లర్లు వేయగా వాటిని ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని స్టేషన్‌ఘన్‌పూర్, చిల్పూరు మండలాల పీఏసీఎస్ వైస్ చైర్మన్ చిర్ర నాగరాజు, డైరెక్టర్ మారేపల్లి కిషన్‌రెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన వారు మాట్లాడారు. 30 ఏళ్ల క్రితం గ్రామంలో సొసైటీ భవనాన్ని 32 గుంటల స్థలంలో నిర్మించినట్లు తెలిపారు. ఇటీవల భవనం చుట్టూ ప్రహరీ నిర్మిస్తుంటే గ్రా మానికి చెందిన దేవరాజుల రోషయ్య, జో డుముంతల కనుకయ్య ఇందులో తమ స్థలం ఉందంటూ కాంట్రాక్టర్‌ను అడ్డుకుని పిల్లర్లును ట్రాక్టర్‌తో కూలగొట్టించారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై విచారణ చేపట్టి వారిపై చర్య తీసుకోవాలని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

సన్మానం

చిల్పూరు: మండలంలోని పల్లగుట్ట గ్రామానికి చెందిన కొయ్యడ రమేశ్ బీసీ బహుజన సంక్షేమ సంఘం జిల్లా ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా రమేశ్‌ను గ్రామంలో చిల్పూరు ఆలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు సోమవారం సన్మానించారు. దార రాజు, యేసు, రాజు, మనోజ్‌కుమార్ రమేశ్ ఉన్నారు.

జయప్రదం చేయాలి

స్టేషన్‌ఘన్‌పూర్: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పిలుపుమేరకు ఫిబ్రవరి 7వ తేదీన ‘వెయ్యి గొంతుకలు-లక్ష డప్పులు’ నినాదంతో చేపట్టనున్న ఛలో హైదరాబాద్ కార్యక్రమానికి మాదిగలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని ఎమ్మెస్పీ జిల్లా కార్యదర్శి మంద శ్రీనివాస్ కోరారు. ఘన్‌పూర్ డివిజన్‌కేంద్రంలో ఎమ్మెస్పీ, ఎమ్మార్పీఎస్ ముఖ్యనాయకుల సమావేశాన్ని ఎంఎస్‌పీ మండల అధ్యక్షుడు గాదె శ్రీధర్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడారు.

నివాళి

జనగామ రూరల్: శామీర్‌పేట గ్రామానికి చెందిన మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సర్వాల నర్సింగరావు భార్య లలిత ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. కాగా, సోమవారం బీసీ కమిషన్ మెంబర్ బాలలక్ష్మి గ్రామానికి చేరుకుని లలిత చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరమర్శించారు.

ఖాతాల్లో జమకాని కమీషన్

● నిరాశలో కంప్యూటర్ ఆపరేటర్లు



సర్వే వివరాలను నమోదు చేస్తున్న ఆపరేటర్లు (ఫైల్)

తరిగొప్పుల: సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా ఎన్యూమరేటర్లు సేకరించి ఫారాల్లో పొందుపరిచిన వివరాలు ఆన్‌లైన్ నమోదు చేసిన ప్రైవేట్ కంప్యూటర్ ఆపరేటర్లకు నేటికి కమీషన్ ఖాతాల్లో జమ కాలేదు. దీంతో వారు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. మండల వ్యాప్తంగా వివరాలు సేకరించిన సమగ్ర కుటుంబ సర్వే ఫారాలు వేల సంఖ్యలో ఉన్నాయి. వాటిని త్వరితగతిన ఆన్‌లైన్‌లో నమోదు చేయాడానికి ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయ ఉద్యోగులతో పాటు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రైవేట్ ఆపరేటర్లను నియమించారు. మండల వ్యాప్తంగా 6,501 సమగ్ర కుటుంబ సర్వే దరఖాస్తులు అందాయి. కాగా, ఆరుగురు ప్రభుత్వ ఉద్యోగులతోపాటు 31 మంది ప్రైవేట్ ఆపరేటర్లు ఫారాల్లోని వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు 921, ఆపరేటర్లు 5,580 కుటుంబాల వివరాలను నమోదు చేశారు. ఒక్కో ఫారం వివరాలు నమోదు చేస్తే ఆపరేటర్‌కి రూ.25 చెల్లిస్తామని అధికారులు తెలిపారు. ఇందుకు గానూ రూ.1,39,525 ప్రైవేట్ ఆపరేటర్లకి రావాల్సి ఉంది. వారి నుంచి వ్యక్తిగత బ్యాంకు ఖాతా వివరాలు తీసుకున్నప్పటికీ నేటికి నగదు జమ కాకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి వెంటనే నగదును ఖాతాల్లో జమచేయాలని వారు కోరుతున్నారు.

బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలి



మాట్లాడుతున్న శ్రీనివాస్

లింగాలఘణపురం/చిల్పూరు: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు కామారెడ్డిలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌ను అమలు చేసి 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన అనంతరమే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చౌదరిపల్లి సతీశ్, జిల్లా అధ్యక్షుడు బాల్నె శ్రీనివాస్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం వారు లింగాలఘణపురం, చిల్పూరు మండలంలోని పల్లగుట్టలో వేర్వేరుగా విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయకుండా, మరోవైపు రైతులను మోసం చేస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ వ్యతిరేక విధానాలపై బీజేపీ పోరాటంలో ముందు ఉంటుందని అన్నారు. ఊరడి రాజు, కాదుగాయ రమేశ్, కందుకూరి రజినీకర్, వెలిశాల శ్రీనివాస్, గుజ్జేటి రమేశ్ పాల్గొన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధికి కృషి

● జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాంబాబు



పుస్తకాన్ని పరిశీలిస్తున్న చైర్మన్ రాంబాబు

స్టేషన్‌ఘన్‌పూర్/జఫర్‌గఢ్: గత ప్రభుత్వాలు గ్రంథాలయాలను పట్టించుకోలేదని కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తాను జిల్లాలోని గ్రంథాలయాల అభివృద్ధికి కృషిచేస్తానని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు అన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలోని, జఫర్‌గఢ్ మండల కేంద్రంలో ఉన్న జఫర్‌గఢ్ శాఖ గ్రంథాలయాలను ఆయన సోమవారం సందర్శించారు. గ్రంథాలయ భవనంలోని పుస్తకాలను, రిజిస్టర్లను పరిశీలించారు. ఆయన వెంట గ్రంథాలయ సంస్థల జిల్లా కార్యదర్శి సుధీర్, , వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ భిక్షపతి, మాజీ సర్పంచ్ కుల్లా మోహన్‌రావు, మాజీ ఎంపీటీసీ జ్యోతి రజితయాకయ్యనాయకులు లోనె శ్రావణ్‌కుమార్, తెల్లాకుల రామకృష్ణ, జానిబాబ, పొన్న రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

చెరువు తూము మరమ్మతులు

రఘునాథపల్లి: మండలంలోని నిడిగొండ ఊర చెరువు తూము మరమ్మతులు చేస్తామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు అన్నారు. ఈ నెల 3వ తేదీన గ్రామస్తులతో ఎమ్మెల్యే కడియం శ్రీహరి సమస్యలపై ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. తూము గుండా వృథాగా నీరు వెళ్తుందని, చెరువులోకి వరద నీరు రావడం లేదని ఆయకట్టు రైతులు ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. దీంతో కడియం ఆదేశాల మేరకు సోమవారం రాంబాబు పార్టీ నాయకులు, రైతులతో కలిసి చెరువు తూమును పరిశీలించారు. అంతేకాకుండా చెరువులోకి వరద నీరు, గోదావరి జలాలు వచ్చేందుకు అశ్వరావుపల్లి రిజర్వాయర్ కెనాల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ తూము మరమ్మతులతో పాటు, మెయిన్ కెనాల్ గుండా చెరువులోకి గోదావరి జలాలు అందించే విధంగా ప్రణాళికలు తయారు చేశామన్నారు. కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్‌చందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్, ఎండీ అబ్బాస్‌మియా, నాయకులు లోనె శ్రవణ్, లక్ష్మారెడ్డి ఉన్నారు.

కలెక్టరేట్‌లో కొండచిలువ కలకలం



కలెక్టరేట్ ఆవరణలో పిల్ల కొండచిలువ

జనగామ: కలెక్టరేట్ ప్రాంగణంలో సోమవారం కొండచిలువ కలకలం సృష్టించింది. ప్రధాన గేటు సమీప రోడ్డుపై సుమారు మీటరున్నర పొడవు ఉన్న కొండచిలువ పిల్ల ఉద్యోగులు, సిబ్బంది, గ్రీవెన్స్‌కు వచ్చే అర్జీదారులను పరుగులు పెట్టించింది. బీటీ రోడ్డుపై నుంచి చెట్ల పొదల్లోకి వెళ్లే క్రమంలో కొండచిలువ తోక కనిపించగా పట్టుకోవడానికి ముందుకు వచ్చిన కొందరు ప్రయత్నించి విఫలమయ్యారు. దీంతో కొండచిలువ చెట్ల పొదల్లోకి వెళ్లింది. కలెక్టరేట్ ఆవరణలో పిచ్చి మొక్కలు, చెత్తా చెదారం పేరుకు పోవడంతో పాములకు ఆవాసంగా మారిందని అక్కడకు వచ్చిన వారు అంటున్నారు. అటవీ శాఖ అధికారులు స్పందించి కొండచిలువను పట్టుకోవాలని కలెక్టరేట్ ప్రాంగణంలో సమ్మె దీక్షలో పాల్గొన్న సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగులు కోరుతున్నారు.

రైతు భరోసా రూ.15 వేలు ఇవ్వాలి

● బీఆర్‌ఎస్ నాయకుల డిమాండ్

సాక్షి నెట్‌వర్క్: ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రైతులకు ఆంక్షలు లేకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రైతుభరోసాను ఎకరాకు రూ.15 వేలు ఇవ్వాలని బీఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీని విస్మరిస్తూ రైతుభరోసాను రూ.12 వేలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించి మోసం చేసిందని ఆరోపిస్తూ సోమవారం పలు మండల కేంద్రాల్లో బీఆర్‌ఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు. రైతు డిక్లరేషన్‌కు అనుగుణంగా రైతుభరోసాను ఇచ్చే దాకా ప్రభుత్వంపై పోరాటం చేస్తామని నాయకులు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



స్టేషన్‌ఘన్‌పూర్: రాస్తారోకోలో మాజీ ఎమ్మెల్యే రాజయ్య.. నాయకులు



లింగాలఘణపురంలో..



దేవరుప్పులలో..



పాలకుర్తి టౌన్: ధర్నా చేస్తున్న నాయకులు

ఓటరు జాబితాలో సరిచూసుకోవాలి

కొడకండ్ల: ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, సూచనలకు అనుగుణంగా ప్రత్యేక ఓటర్ జాబితాలను సవరించి అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రచురించినందున ఓటర్లు తమ పేర్లను సరిచూసుకోవాలని తహసీల్దార్ కోల చంద్రమోహన్ కోరారు. ఓటరు జాబితాలను పరిశీలించుకుని ఏమైనా పొరపాట్లు, మార్పులు అవసరమైతే సంబంధిత బూత్ స్థాయి అధికారులను సంప్రదించాలని సూచించారు.

క్రీడలతో మానసికోల్లాసం

పాలకుర్తి: క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందని ఎస్సై దూలం పవన్‌కుమార్ అన్నారు. సోమవారం పోలీస్‌స్టేషన్‌లో సంక్రాంతి పండుగ, సేవాలాల్ జయంతిని పురస్కరించుకుని సేవాలాల్ సేనా పాలకుర్తి కమిటీ ఆధ్వర్యంలో 15, 16 తేదీల్లో నల్లిగాని తండాలో నిర్వహించనున్న కబడ్డీ క్రీడోత్సవాల పోస్టర్‌ను ఎస్సై ఆవిష్కరించి మాట్లాడారు. క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసానికి దోహదపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో కునుసోతు ప్రవీన్, సతీష్, హుస్సేన్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సమగ్రాభివృద్ధికి పాటుపడుదాం..

● హెచ్‌ఈటీ చైర్మన్ అంబటి యాకన్న

దేవరుప్పుల : సామాజిక సేవ దృక్పథంతో జన్మనిచ్చిన గ్రామ సమగ్రాభివృద్ధి కోసం పాటుపడుదామని హెల్త్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చైర్మన్ అంబటి యాకయ్య పిలుపునిచ్చారు. సోమవారం సీతారాంపురం గ్రామంలో హెచ్‌ఈటీ భవిష్యత్ కార్యాచరణ కోసం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఏ రంగంలో రాణించాలన్నా విద్య ప్రాథమిక హక్కుగా చైతన్యం చేస్తూ ప్రతి ఇంటా ఉన్నత విద్య పొందేలా విస్తృత ప్రచారం చేయాలన్నారు. అనంతరం ఇటీవల నేషనల్ టాలెంట్ టెస్ట్‌లో గోల్డ్ మెడల్ సాధించిన ఉమేష్‌ను అభినందించారు. పగిడిపల్లి సతీష్, ఆవుల రాజు, పుప్పాల విష్ణు, డాక్టర్ కాంటారి హనుమాజీ పాల్గొన్నారు.

‘సంక్షేమ పథకాల అమలు కాంగ్రెస్‌తోనే సాధ్యం’



పాలకుర్తి టౌన్: సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



కొడకండ్ల: సీఎం ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు



బచ్చన్నపేట: మాట్లాడుతున్న జయప్రకాశ్‌రెడ్డి

పాలకుర్తి టౌన్: సంక్షేమ పథకాలు అమలు చేయడం ఒక్క కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని కొడకండ్ల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ అన్నారు. రైతు భరోసా పథకాన్ని ప్రభుత్వం ప్రకటించడంతో కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తూ సోమవారం మండల కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారయణ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని విస్మరించిందన్నారు. మండల కాంగ్రెస్ అధ్యక్షులు గిరగాని కుమారస్వామి, నాయకులు కారుపోతుల శ్రీనివాస్, గద్దం యాకసోమయ్య, గిగ్గిళ్ళ ఆదినారాయణ,మాదాసు హరీష్,నాగన్న, ఐలేష్,రమేష్, ఎండీ సలీం, గేదే పాక భాస్కర్,దొంతి ఎల్లయ్య, పస్నీరు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

హామీలను నెరవేర్చడం కాంగ్రెస్ నైజం

కొడకండ్ల: మాట తప్పకుండా ప్రజలకు ఇచ్చిన హామీలను నేరవేర్చడం కాంగ్రెస్ నైజమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ధరావత్ సురేష్‌నాయక్, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు రాజేష్‌నాయక్ అన్నారు. రైతుభరోసా, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్‌కార్డుల జారీ, భూమిలేని పేదలకు ఏడాదికి రూ.12 వేల పథకాలను ఈ నెల 26 నుంచి ప్రభుత్వం అమలు చేస్తామని ప్రకటించడాన్ని హర్షిస్తూ సోమవారం మండలకేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, ఝాన్సీరెడ్డిల ఫ్లెక్సీలకు కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం నిర్వహించారు. యాకయ్య, సోమనర్సయ్య, భిక్షపతి, రవీదర్, నాగరాజు, రమేష్, మధుసూధన్, వెంకన్న, గపూర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల సంబురాలు

తరిగొప్పుల: ఈనెల 26వ తేదీన రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అమలు చేయనున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన నేపథ్యంలో సంపూర్ణ మద్దతు తెలుపుతూ మండలకేంద్రంలో కాంగ్రెస్ నాయకులు సంబురాలు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు వగలబోయిన యాదగిరి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు ప్రభుత్వమని, రైతాంగ అభివృద్ధికి కృషిచేస్తుందన్నారు. పండుగ కనుకయ్య, అరుణ్‌రెడ్డి, శివకుమార్, శ్రావణ్‌రెడ్డి, పోషయ్య, ఆవుల రాములు, గోరంతల వీరన్న, లూకా, నరహరి పాల్గొన్నారు.

సీఎం రైతు పక్షపాతి

బచ్చన్నపేట: సీఎం రేవంత్‌రెడ్డి రైతు పక్షపాతి అని కొమురవెల్లి దేవస్థాన డైరెక్టర్ కొప్పురపు జయప్రకాశ్‌రెడ్డి (విప్లవ్‌రెడ్డి) అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ సీఎం ప్రకటించిన రైతు భరోసా ఎకరాకు రూ.12 వేల సాయం ఈ నెల 26వ తేదీనుంచి నేరుగా అన్నదాతల ఖాతాల్లో జమ అవుతాయని తెలిపారు. అలాగే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అన్నింటిని ఒక్కొక్కటిగా సీఎం అమలు చేస్తున్నారని అన్నారు. చల్ల రమేష్‌రెడ్డి, ఎర్రం భాస్కర్, మామిండ్ల చందు, జంగిలి స్వామి, చల్ల సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

రాజకీయ ఉనికి కోసం బీఆర్‌ఎస్ పాట్లు

● టీపీసీసీ సభ్యుడు లక్ష్మీనారాయణనాయక్

దేవరుప్పుల: తెలంగాణ రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిన బీఆర్‌ఎస్ రాజకీయ ఉనికి కోసం పడరాని పాట్లు పడుతోందని టీపీసీసీ సభ్యుడు డాక్టర్ లకావత్ లక్ష్మీనారాయణనాయక్ విమర్శించారు. సోమవారం మండలంలోని పొట్టిగుట్ట తండాకు చెందిన కాంగ్రెస్ నాయకురాడు నూనావత్ ద్వాలీ చుట్టపు చూపరిగా వచ్చి ధర్మగడ్డ(దొడ్లబండ)తండాలో అకాల మరణం పొందగా ఆమె మృతదేహానికి ఆయన పూలమాల వేసి ఘననివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థికసాయం అందజేసి మాట్లాడారు. సురేష్ బాబు, నాగరాజు తదితరులు ఉన్నారు.

డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



జనగామ రూరల్: నూతన సంవత్సర యూటీఎఫ్ డైరీ, క్యాలెండర్‌ను సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆవిష్కరించారు. రాష్ట్ర కార్యదర్శి రంజిత్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రావు, ప్ర ధాన కార్యదర్శి వెంకటేష్ పాల్గొన్నారు. అలాగే డీ టీఎఫ్ డైరీ, క్యాలెండర్‌ను స్థానిక ప్రభుత్వ జూ నియర్ కళాశాలలో నాయకులు ఆవిష్కరించారు.

చంద్రయ్యకు అంబేడ్కర్ అవార్డు

కొడకండ్ల: మండలకేంద్రానికి చెందిన సీనియర్ దళిత సామాజిక వర్గ నాయకుడు అందె చంద్రయ్య అంబేడ్కర్ జాతీయ అవార్డును అందుకున్నాడు. ఆల్ ఇండియా బహుజన సాహిత్య అకాడమీ చంద్రయ్య సేవలను గుర్తించి సోమవారం జాతీయ అవార్డును అందజేసింది. అలాగే రంగాపురం గ్రామానికి చెందిన సోమారపు వెంకన్నకు కూడా అంబేడ్కర్ జాతీయ అవార్డును అందించారు. మండలానికి చెందిన ఇద్దరి దళిత నాయకులకు అవార్డు దక్కడంపై దళిత నాయకులు హర్షం వెలిబుచ్చారు.

ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు

దేవరుప్పుల: మండంలోని వాగు పరివాహక ప్రాంతాల్లో అక్రమంగా ఇసుక రవాణాకు పాల్పడితే చట్టపరంగా చర్యలు అనివార్యమని ఎస్సై ఊర సృజన్‌కుమార్ హెచ్చరించారు. సోమవారం రాత్రి గొల్లపల్లి వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మంజు సాయికుమార్‌పై కేసు నమోదు చేసి సదరు ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.

పైపులైన్ తొలగించాలని విద్యుత్ కనెక్షన్ కట్

● ఎండుతున్న పొలం, పొగాకు పంట
● పోలీస్‌స్టేషన్‌లో బాధిత రైతు ఫిర్యాదు



ఎండుతున్న పొలం చూపుతున్న బాధితులు

రఘునాథపల్లి: భూమిలో వేసిన పైపులైన్ తొలగించాలని ఓ రైతు మరో రైతు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కట్ చేయడంతో దున్నిన పొలం, సాగు చేసిన పొగాకు ఎండుతున్న సంఘటన మండలంలోని జాఫర్‌గూడెంలో చోటు చేసుకుంది. ఈ మేరకు విద్యుత్ కనెక్షన్ కట్ చేసిన రైతుపై సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధిత రైతు పులిగిల్ల అంజయ్య తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామశివారులోని అశ్వరావుపల్లి కెనాల్‌లో మోటార్ వేసుకుని తన వ్యవసాయ భూమిలోకి మరో రైతు వ్యవసాయ భూమిలోని నుంచి పైపులైన్ వేసుకున్నారు. సదరు రైతు సొంత భూమిలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ నుంచి అంజయ్య డీడీ చెల్లించి కనెక్షన్ తీసుకున్నాడు. ఇందుకు సదరు రైతుకు ట్రాన్స్‌ఫార్మర్ ఖర్చుల కింద రూ.20 వేలు, పైపులైన్ వేసుకున్నందుకు మరో రూ.20 వేలు అప్పజెప్పాడు. కొన్నాళ్లుగా అంజయ్య, సదరు రైతు మధ్య వివాదం నెలకొంది. ఇటీవల తన భూమిలోని పైపులైన్ తీసివేయాలని, ట్రాన్స్‌ఫార్మర్ నుంచి కరెంట్ కనెక్షన్ తొలగించాడు. దీంతో అంజయ్య రోడ్డు మార్గం ద్వారా పైపులైన్ వేసుకొని పొగాకు నాటి, పొలం దున్నాడు. తన భూమిలోని ట్రాన్స్‌ఫార్మర్ నుంచి కలెక్షన్ ఉండనివ్వనని సదరు రైతు వైర్లు కట్ చేశాడు. దున్నిన పొలం, సాగు చేసిన పొగాకు ఎండుముఖం పట్టింది. ఆకారణంగా విద్యుత్ మోటర్ కనెక్షన్ కట్ చేస్తూ తనకు నష్టం చేకూరుస్తున్న వ్యక్తిపై తగు చర్యలు తీసుకోవాలని అంజయ్య పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై ఎస్సై దూదిమెట్ల నరేశ్‌ను వివరణ కోరగా అంజయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టినట్లు తెలిపారు.

పార్టీలకతీతంగా విజయవంతం చేయండి

● బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పింగిళి జగన్‌మోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న జగన్‌మోహన్‌రెడ్డి

తరిగొప్పుల: మండలంలో సాగునీరు సమస్యను తీర్చేందుకు దేవాదుల గ్రేడ్-2 లిఫ్ట్ ఇరిగేషన్‌లో భాగంగా చేపట్టే పైపులైను పనుల ప్రారంభోత్సవ కార్యక్రమానికి పార్టీలకతీతంగా రైతులందరూ పాల్గొని విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పింగిళి జగన్‌మోహన్‌రెడ్డి కోరారు. గ్రామశాఖ అధ్యక్షుడు అంకం రాజారాం అధ్యక్షతన సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పైపులైను నిర్మాణంతో మండలపరిధిలోని పలు చెరువులు, కుంటలను సాగునీరుతో నింపడం జరుగుతుందన్నారు. నేడు(మంగళవారం)ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి చేతుల మీదుగా పనుల ప్రారంభానికి భూమిపూజ చేయనున్నట్లు తెలిపారు. నాయకులు చిలువేరు లింగం, దామెర ప్రభుదాస్,సుదర్శన్ గౌడ్, వెంకట్‌రెడ్డి, రాజయ్య, చెన్నూరి సంజీవ, రామరాజు, రాజేశ్వర్‌గౌడ్, భూక్య జుంలాల్ నాయక్, యాదగిరి,నర్సింహులు, రవీందర్, సాయిల్ల రాజు, రమేష్, కుమార్ పాల్గొన్నారు.

డబుల్‌బెడ్రూంల కోసం కొత్త దరఖాస్తుల స్వీకరణ


● తహసీల్దార్ ఎం మహిపాల్‌రెడ్డి



తహసీల్దార్ మహిపాల్‌రెడ్డి

దేవరుప్పుల: మండలంలోని పలు గ్రామాల్లో నిర్మించిన డబుల్‌బెడ్రూంల లబ్ధిదారుల ఎంపిక కోసం కొత్తగా దరఖాస్తులను ఆయా పంచాయతీ కార్యదర్శుల ద్వారా స్వీకరిస్తున్నట్లు తహసీల్దార్ ఎం.మహిపాల్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండల తహసీల్‌లో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం హయాంలో నిర్మించిన పెండింగ్ ఇళ్లను కలెక్టర్ నిర్దేశిత ఉత్తర్వుల మేరకు గ్రామ సభల ద్వారా ఎంపిక చేసేందుకు దరఖాస్తులను స్వీకరిస్తామన్నారు. లబ్ధిదారుల ఎంపిక కోసం కొత్తగా దరఖాస్తులు ఇచ్చిన వారికే గ్రామ సభల్లో ఎంపిచేయనున్నట్లు వెల్లడించారు. ఇల్లులేని నిరుపేదలు కుటుంబ ఆహార భద్రత(రేషన్‌కార్డు) కార్డు, ఆధార్‌కార్డులు, ఇంటి యజమానురాలు ఓటరు గుర్తింపు కార్డు జిరాక్స్ ప్రతులను జతపర్చి గ్రామ కార్యదర్శులకు అందజేయాలని సూచించారు.

తిరుప్పావై ప్రవచనాలు



ప్రవచనాలు వినిపిస్తున్న జనార్థనాచార్యులు

జఫర్‌గఢ్: కూనూర్‌లోని శ్రీరంగనాథస్వామి ఆలయంలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆల్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టు సౌజన్యంతో ఆగమ వైభవ బ్రహ్మ గుంటురు జనార్ధనాచార్యులు తిరుప్పావై ప్రవచనాలు వినిపించారు. 21 రోజుల నుంచి ఆయన ప్రవచనాలు వినిపిస్తుచెబుతున్నారు. వీటిని పరిశీలించేందుకు సోమవారం సంబంధిత ప్రాజెక్టు ప్రత్యేక అధికారి శ్రీమాన్ వింజమూరి విజయ్‌కుమార్ ఆలయాన్ని సందర్శించి పూజలు నిర్వహించారు.

జగన్మాత ఆరాధనతో అంతా శుభమే



ఎమ్మెల్యేను ఆశీర్వదిస్తున్న వేదపండితులు

కొడకండ్ల : జగన్మాత ఆరాధనతో అంతా శుభమే జరుగుతుందని శృంగేరి పీఠాధిపతి విదుశేఖరభారతిస్వామి అన్నారు. మండలకేంద్రంలోని యోగలింగేశ్వర సహిత రాజరాజేశ్వరి ఆలయంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న రాజరాజేశ్వరి పట్టాభిషేక సహిత లలిత నిత్యయాగ మహోత్సవం సోమవారం ముగిసింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వేద పండితులు చివరిరోజు ఆలయ ధర్మకర్త పాలకుర్తి సుధాకరగౌతంశర్మ నేతృత్వంలో పూర్ణాహుతి, సుహాసిని పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా విదుశేఖరభారతిస్వామి ఆన్‌లైన్‌లో అనుగ్రహ భాషణం చేస్తూ కొడకండ్లలో అనేక ఏళ్లుగా రాజరాజేశ్వరి అమ్మవారి సన్నిధిలో ఆరాధన చేసి ఎందరికో మంత్రోపదేశం ఇచ్చి మార్గం చూపిన వ్యక్తి సిద్ధాంతి పాలకుర్తి నర్సింహరామశర్మ అన్నారు. సిద్ధాంతి కోరిక మేరకు ఈ క్షేత్రాన్ని శృంగేరి పీఠానికి దత్తత తీసుకున్నామని వివరించారు. కుత్బుల్లాపూర్, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యేలు వివేకానందగౌడ్, సూర్యనారాయణ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
కె. మల్లేశ్ (S.R) : 9849921793 (జనగామ)
ఎన్. అనిల్ (S.R) : 9949363827 (పాలకుర్తి)
ఎల్. అనిల్ (S.R) : 8074977328 (స్టే॥ ఘన్‌పూర్)